సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
మంగళవారం 26 నవంబర్ 2024
పేజీలు 8

## ప్రతి ఏడాది నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం



- ప్రత్యేక గ్రామసభలుగా నిర్వహించాలి
- కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈనెల 26వ తేదీ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, మొదలైన వాటిలో భారత రాజ్యాంగ పీఠికను ఉదయం 11:30 గంటలకు సామూహికంగా చదవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలియజేశారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంగా రాజ్యాంగ నిర్మాతలను గౌరవించడం, గుర్తించడం, రాజ్యాంగాన్ని ప్రోత్సహించడం కోసం ప్రతి సంవత్సరం నవంబర్ 26న సంవిధాన్ దివస్ (రాజ్యాంగ దినోత్సవం)గా జరుపుకుంటామని తెలిపారు. భారతదేశం, ఒక సార్వభౌమ ప్రజాస్వామ్య మిగతా 2లో

# మంచిని అనుసరించాలి

**నేను వ్యక్తిగతంగా సోషల్ మీడియా ఫాలోకాను**

**చాలా మంది ప్రముఖులు కూడా సోషల్ మీడియాను ఫాలో అవ్వరు**

**సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధి**




**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** యువతీ, యువకులు సోషల్ మీడియాలో ఉన్న చెడు వైపు వెళ్లకుండా మంచిని అనుసరిస్తూ తమ జీవితాలను సన్మార్గంలో తీర్చిదిద్దుకోవాలని సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాలలో సోమవారం ఏర్పాటు చేసిన సోషల్ మీడియా దుర్వినియోగం, బాధ్యులు కావటంపై అవగాహన కల్పించడం, సైబర్ బెదిరింపు, వాటి ప్రభావంపై అవగాహనపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌కు సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోషల్ మీడియా దుర్వినియోగంపై యువతలో అవగాహన కల్పించాలన్నారు. ఒక్కో సారి నాకే వ్యక్తిగతం స్మార్ట్ ఫోన్‌ను తీసి పారెయ్యాలనిపిస్తుందన్నారు. దీని వల్ల మానవ సంబంధాలు చాలా దెబ్బతింటున్నాయన్నారు. గతంలో కుటుం బమంతా కలసి ఎంతో ఆనందంగా గడిపేపేవాళ్లమని, ఇప్పుడు ఎవరి రూముల్లో వారు స్మార్ట్ ఫోన్‌తో ఉండటానికి ఇష్టపడుతున్నామన్నారు. అంతే కాకుండా మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయన్నారు.. మనకు తెలియకుండానే మనం సోషల్ మీడియాకి ఎడిక్ట్ అయిపోతున్నామన్నారు. ఒకసారి నాకే మా అబ్బాయి గురించి ఫేక్ వార్త రాగా ఆ ప్రయత్నాన్ని నేను మిగతా 2లో...



# యువతకు స్ఫూర్తిగా 'యువ కెరటాలు'

**గత ప్రభుత్వ విధానాల వల్ల యువత నిస్తేజం**

**నూతన ఉత్సాహం ఉత్తేజం కలిగించేందుకు 2025 జనవరి మొదటి వారంలో యువ కెరటాలు**

**రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** యువతకు స్ఫూర్తిదాయకంగా యువ కెరటాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో సోమవారం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అధికారులతో కలిసి మంత్రి యువ కెరటాలు కార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాల వల్ల నిస్తేజంగా ఉన్న యువతను చైతన్యవంతం చేయుటకు, వారిలో నూతన ఉత్సాహం ఉత్తేజం కలిగించేందుకు వారిలో స్ఫూర్తి ఆత్మ స్థైర్యం నింపేందుకు 2025 జనవరి మొదటి వారంలో యువ కెరటాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించినట్లు తెలిపారు. టూరిజం అభివృద్ధిలో భాగంగా వచ్చే ఫిబ్రవరిలో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. మచిలీపట్నం పోర్టు పనులు, ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, రెండు వారాలకోసారి పోర్టు పనులు సమీక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మిగతా 2లో...

## స్వచ్ఛంద సంస్థల సహకారం

# అభినందనీయం



**ప్రజల జీవన పరిమాణాల మెరుగుపరచడంలో ప్రభుత్వం కృషి**

**మోడ్రన్ అంగన్వాడీ స్కూల్ ప్రారంభోత్సవంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**ఎమ్మెల్యే రాము లాంటి ప్రజా ప్రతినిధుల సహకారం ఎనలేనిది**

**యాక్టర్ కబీర్ బేడీ**

**నందివాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని పేద వర్గాలకు ఆర్థిక ప్రగతిని చేకూర్చేలా కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిలో.. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అందిస్తున్న సహకారం అభినందనీయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఇటలీకి చెందిన కేర్ టు యాక్షన్ సంస్థ సహకారం రూ.30 లక్షల నిధులతో గుడ్లవల్లేరు 2

(మొదటిపేజీ తరువాయి)

## ప్రతి ఏడాది నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం

గణతంత్ర రాజ్యంగా, రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటినుండి ప్రతి ఏడాది నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం యొక్క ప్రాముఖ్యత దృష్ట్యా, అన్ని గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు ఈ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని తెలిపారు. ఇందుకు సంబంధించి జడ్పీ సీఈఓ, డీపీఓ, ఎంపీడీఓలు మండల స్థాయి, గ్రామపంచాయతీ స్థాయిల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రత్యేక గ్రామసభలుగా నిర్వహించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## యువతకు స్ఫూర్తిగా 'యువ కెరటాలు'



నగరంలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలి పారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ యువతలో దాగివున్న సృజ నాత్మకత, టాలెంట్ వెలికి తీసి వారిని ఆ దిశగా ప్రోత్స హిస్తే జీవితంలో వారు ఎదగగలరని, ఇందుకు యువకెరటాలు కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. పాఠశాల, కళాశాలల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వ హించడం జరుగుతుందని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా యువతను మోటి వేట్ చేయడానికి ఆర్టిఫిషియల్ ఇం టెలిజెన్స్, ఇస్రో, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, సైబర్ క్రైమ్ వంటి పలు విషయాల్లో అవగాహన పెంపొందించేందుకు స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రముఖులతో మోటివేషనల్ స్పీచెస్ ఇ ప్పించడం, జీవితంలో ఎంతో కష్టపడి ఉన్నత శిఖరాలు అధిరోహించిన వ్యక్తులతో స్ఫూర్తిదాయక ప్రసంగాలతో యువతలో చైతన్యం తీసుకురా వడం ముఖ్య ఉద్దేశం అన్నారు.తొలుత ఈ సమావేశంలో ఆనంద్ గతంలో నిర్వహించిన యువ కెరటాలు కార్యక్రమం వివరాలు సమావేశంలో అధికారులకు వివరించారు.

## స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం



మండలం ఇందిరానగర్ లో నిర్మించిన అంగన్వాడి ప్రీ ప్రైమరీ పాఠశాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ప్రముఖ బాలీవుడ్ నటుడు కబీర్ బేడి, ఏపీ ఎస్ డబ్ల్యూ సి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు సోమవారం ఉదయం ప్రారంభించారు. అనంతరం ప్రైమరీ పాఠశాలలోని ఇతర విభాగాలను సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆహ్లాదకరమైన వాతావరణం, సదుపాయాలను నాయకులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా గుడివాడలో ప్రజలకు మంచి చేసే మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కేర్ సంస్థ ప్రతినిధులకు ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ కేర్ టు యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న మంచి కార్యక్రమంలో ఇండియా స్టైలిష్ లెజెండరీ యాక్టర్ కబీర్ బేడి గుడ్లవల్లేరు రావడం సంతోషకరమని ఎమ్మెల్యే రాము హర్షం వ్యక్తం చేశారు. కేర్ సంస్థ చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని.. ప్రజల మంచి కోసం పనిచేస్తున్న వారితో కలిసి నడిచేందుకు తాను సిద్ధం ఉన్నానని సభాముఖంగా ఎమ్మెల్యే రాము ప్రకటించారు. ఎమ్మెల్యే ప్రకటనతో కేర్ సంస్థ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలకు మేలు చేయాలనుకునే తమలాంటి సంస్థలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము లాంటి ప్రజాప్రతినిధులు సహకారం ఉంటే... ప్రజలకు మేలు చేసేలా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉంటుందని బాలీవుడ్ యాక్టర్ కేర్ సంస్థ గ్లోబల్ అంబాసిడర్ కబీర్ బేడి అన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ జనసేన పార్టీ ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్..కేర్ టు యాక్షన్ సంస్థ గ్లోబల్ అంబాసిడర్ రోమినా పవర్, ప్రతినిధులు రోసారియో జక్కాటిజియానా స్టాఫోలనీ,పర్వీన్ దుసంజ్,టిజియానా నిన్ని,యారి కారిస్సీ,కార్మెలా లిండా మోండెల్లి,డారియో బియాంచిని,కళామణి, మండల కూటమి పార్టీల నాయకులు పొట్లూరి రవి,జంగం మోహనరావు,చాపరాల బాలాజీ,వల్లభనేని వెంకట్రావు,బొర్రా నాగేశ్వరరావు వల్లభనేని సుబ్బారావు, పొలవరపు వెంకట్రావు పళ్ళెం నరసింహారావు,చాపరాల రాజా, పరంధామయ్య, దివ్య చౌదరి, శశికళ కళ్యణపు నవాబు, నాగూర్, శాయన శ్రీహరి, రావాడ గోపాల్, దాసరి మల్లి, తుమ్మపూడి నాని, నాగేశ్వరావు పలువురు మండల ప్రముఖులు, కూటమి నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




(మొదటిపేజీ తరువాయి)

## మంచిని అనుసరించాలి

గట్టిగా తిప్పికొట్టానన్నారు.. అదేవిధంగా ఇటీవల నా నియోజకవర్గంలో రిటైర్డ్ నర్సు అకౌంట్ లోంచి దాదాపు రూ. 40 లక్షలు సైబర్ నేరగాళ్లు దోచుకున్నారన్నారు.. ఏలూరు ఎస్పీ ఆధ్వర్యంలో వేగంగా విచారణ జరుగుతుందన్నారు.. అదేవిధంగా సూరత్‌లో ఒక వ్యాపారి కుమార్డు గురించి ఫేక్ న్యూస్ చెప్పి దోచుకోవాలని చూశారు కాని వ్యాపారి అప్రమత్తంగా ఉండటంతో సైబర్ నేంగాళ్లు ఏమీ చేయలేకపోయారన్నారు. యువతీ, యువకులు తప్పు చేసి మీ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.. కుటుంబాల మీదకు తీసుకువచ్చి ఇబ్బందిపడవద్దన్నారు. నేను వ్యక్తిగతంగా సోషల్ మీడియా చూడను, పాలోకాను.. కాని చాట్ జీపీటీ ను చూస్తాను.. ఏదైనా సబ్జెక్ట్ కు సంబంధించిన సమాచారం కోసం వాడతానన్నారు. సైబర్ క్రైమ్స్ పై ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా యువతీ యువకులను కాపాడాలని ఇందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి లోకేష్ సూచించారన్నారు. రాజకీయాల్లో సోషల్ మీడియా గురించి ఎక్కువగా తెలిసిన వ్యక్తి, ఎంతో దూర ధృష్టితో విజనరీ ఉన్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని అందుకే స్వర్ణాంధ్ర 2047 కు అడుగులు చేస్తున్నారన్నారు. రాజకీయ నాయకులు ఎక్కువగా సోషల్ మీడియాను వాడుతున్నారని, మంచి విషయాల కంటే చెడు విషయాలకే సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్నారన్నారు. చెడు గురించి ఎక్కువగా మాట్లాడే వారికి నేడు ఆదరణ ఎక్కువగా ఉంటోందన్నారు. అలాంటి విషయాలను యువతీ, యువకలు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. యువతీ, యువకలు చెడు వైపు వెళ్లకుండా మంచి వైపు పయనించి తమ జీవితాలన సరిచేసుకునే విధంగా సోషల్ మీడియాను మలచుకోవాలన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ను యువతీ, యువకులు విద్య, ఉపాధి, కమ్యునికేషన్ కు వేదికగా ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలను ఉపయోగించి వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకోవచ్చని, మంచి కోసం సోషల్ మీడియాలోని సమాచారాన్ని వాడుకోవచ్చన్నారు. నాయకులు సోషల్ మీడియా ద్వారా మన ఇళ్లల్లోని మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారని ముఖ్యంగా ఇందులో మన చెల్లి, తల్లి కూడా ఉండొచ్చన్నారు. ఎన్నో దూషణలతో కూడిన ఫొటోలను పెడుతున్నారని ఇలాంటి వాటిని నేటి యువత ఖండించకపోతే సమాజం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. మన కుటుంబ సభ్యుల్ని కించపరిస్తే మనం ఏవిధంగా ఇబ్బంది పడతామో తెలిసిందేనన్నారు. ఎన్ని పోస్టులు పెట్టినా దొరకం అని సైబర్ నేరగాళ్లు భావిస్తున్నారని.. కాని పోస్టులు పెట్టిన వారిని ప్రభుత్వం విడచిపెట్టే ప్రసక్తి లేదన్నారు. అలాంటి వార్తలను లైక్ చేయడం కాని ఫార్వర్డ్ చేయడం కాని చేయొద్దని, అలా చేసినా నేరాన్ని ప్రోత్సహించినట్టేనన్నారు. రాజకీయాల్లో ఎవరైనా తప్పులు చేస్తే ఆ తప్పులను ఖండించాలని కాని సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడకూడదన్నారు. లోన్ యాప్ ల ద్వారా కూడా అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీనిపై ముఖ్యంగా యువతీ, యువకులు జాగరూకతతో అడుగులు వేయాలన్నారు. ఇలాంటి వాటికి సహకరించిన వారికి కూడా శిక్షలు పడతాయన్నారు. సభా అధ్యక్షురాలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కే. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నేడు సాంకేతిక అనేది అభివృద్ధికి అడ్రస్ గా మారుతుందన్నారు. ఒకసారి గూగుల్ తో కనెక్ట్ అయ్యామంటే మన ప్రతి మూమెంట్ తెలుసుకోవడం చాలా సులువు అవుతుందన్నారు. సోషల్ మీడియాపై యువతీ, యువకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ వర్క్ షాపులో కాలేజీయేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా, 23 డివిజన్ కార్పొరేట్ వి. రాజేశ్వరి, తిరుమలేశ్వరి, చేకూరి శ్రీపతిరావు, డా. టీడీ విమల తదితరలు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఆకర్షణగా గాంధీ కొండ ప్లానిటోరియం

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** గాంధీ కొండ వద్ద ఉన్న ప్లానిటోరియం విజయవాడకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం నాడు విడుదల చేసిన ప్రకటనలో వన్ టౌన్ గాంధీ హిల్ లో ఉన్న ప్లానిటోరియంలో ప్రజలు ఇకనుండి వీక్షించవచ్చని అన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించే గాంధీ హిల్ లో అంతరిక్ష పరిజ్ఞానం పెంచేందుకు ఏర్పాటు చేసిన ప్లానెటోరియం ను ప్రజలందరూ వీక్షించవలసిందిగా కోరారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండేందుకు 40 రూపాయలు ప్రవేశ టికెట్ గా పెట్టినట్లు తెలిపారు. 63 సిట్టింగ్ కెపాసిటీ గల ప్లానిటోరియంను ముఖ్యంగా విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఉద్దేశంతో, పాఠశాలల నుండి ప్రత్యేక బుకింగ్ చేసుకున్న వారికి 50% ప్రవేశ రుసుము లో రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. బుధవారం నుండి ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 7 గంటల వరకు ప్రతి అరగంటకు షో వేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల/కళాశాలలు నుండి ప్రత్యేకంగా బుకింగ్స్ చేసుకున్న వారికి ఉదయం నుండి సాయంత్రం వరకు వారు బుకింగ్ చేసుకున్న సమయంలో షో వేస్తామని తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహణ కొరకు సెలవు అని అన్నారు. విజయవాడలో ప్రత్యేక ఆకర్షణగా ఉన్న గాంధీ కొండ ప్లానిటోరియంలో వీక్షించి అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ప్రజలందరినీ కోరారు.



## గత మార్కింగ్ ప్రకారం ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించాలి

**జి.కొండూరు మేయర్ న్యూస్ :** ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి గతంలో ఇచ్చిన మార్కింగ్ ప్రకారం భూ సేకరణ చేపట్టాలని రైతు సోదరులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ లక్ష్మీషాను కలిసి వినతిపత్రం సమర్పించారు. రైతులు వినతి పత్రంలో పేర్కొన్న విషయాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. "జి.కొండూరు మండలం, కోడూరు, చిననందిగామ గ్రామాలలో ఔటర్ రింగ్ రోడ్డు కొరకు ఇటీవల సంబంధిత అధికారులు ఆ ప్రాంతంలో ఉన్న రైతులకు ఎటువంటి సమాచారం లేకుండా భూములను సర్వే చేసి భూములో రాళ్లను పాతారు. గతంలో ఔటర్ రింగ్ రోడ్డు కోసం మైలవరం, చిన్న నందిగామ, గణపవరం, ఈదర అడ్డరోడ్డు మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు కోసం ఆ ప్రాంతంలోని రైతులకు నోటీసులు ఇచ్చి, అధికారులు సర్వే చేసి రాళ్లు పాతారు. కానీ ప్రస్తుతం దానిని పక్కన పెట్టి తాజాగా ఔటర్ రింగ్ రోడ్డు పేరుతో అధికారులు మరో మార్గంలో సర్వే నిర్వహిస్తున్నారు. తాజాగా నిర్వహించే సర్వేలో ఎక్కువగా మామిడి, సపోటా వంటి తోటలతో పాటు మిర్చి, పత్తి, పసుపు, వేరుశనగ, వరి వంటి వాణిజ్య పంటలు పండుతున్నాయి. అంతేగాక చెరువులు, భూగర్భ జలాలు అధికంగా ఉండే సారవంతమైన భూములు ఉన్నాయి. వీటిలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరిగితే అనేక సారవంతమైన భూములు నాశనమై పోవటమే కాకుండా పంటలకు సాగునీటిని, పశువులకు, మనుషులకు తాగునీటిని అందించే చెరువులు కూడా ధ్వంసం అయ్యే ప్రమాదం ఉంది. గతంలో ఇవే భూములలో గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్), రిలయన్స్ గ్యాస్ పైప్ లైన్, ఏపీ 400 కె.వి విద్యుత్ టవర్ లైను, నాగార్జునసాగర్ ప్రాజెక్టు వాటర్ కెనాల్ మొదలగు లైన్లు ఏర్పాటు చేశారు. వీటి వలన మా భూములలో ఎటువంటి దీర్ఘ కాలిక పనులు చేయలేక, సరైన పంటలు పండించుకునే అవకాశం లేక ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రస్తుతం మాకు ఉన్న ఈ కొద్ది భూములలో తాజాగా మళ్లీ ఔటర్ రింగ్ రోడ్డు కోసం సర్వే చేయడం, ఔటర్ రింగ్ రోడ్డు వేయటం జరిగితే ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీలకు చెందిన సన్న, చిన్నకారు రైతులమైన తాము జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుంది. తాతలు తండ్రుల నాటి నుండి దశాబ్దాలుగా అర ఎకరం, ఎకరం పొలంతో తాము తమ కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నామని, అసలే అంతంత మాత్రంగా ఉన్న వ్యవసాయ రంగంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నామని, ఈ పరిస్థితులలో అరకొరగా ఉన్న మా భూములలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరిగితే ఉన్న భూములను కూడా కోల్పోయి జీవనాధారం లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇటువంటి పరిస్థితులలో కుటుంబాలు గడవక మా కుటుం బాలన్నీ మూకుమ్మడిగా పురుగుల మందు తాగి ఆత్మహత్యలకు పాల్పడటం తప్ప మరో మార్గం లేదు.గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్), రిలయన్స్ గ్యాస్ పైప్ లైన్, ఏపీ 400 కె వి విద్యుత్ టవర్ లైను, నాగార్జున సాగర్ ప్రాజెక్టు కాలువలు కూడా మా భూములనుండే వెళుతున్నాయి. ఇప్పటికే కోడూరు గ్రామానికి చెందిన అనేక మంది రైతులమైన తాము తీవ్రంగా నష్టపోయాం. మళ్లీ ఈ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరిగితే తాము మరింత నష్టపోవాల్సి వస్తుంది.గతంలో ఔటర్ రింగ్ రోడ్డు కోసం సర్వే చేసిన మైలవరం, చిన్న నందిగామ, గణపవరం, ఈదర అడ్డరోడ్డు ప్రాంతాలలోని భూములు ఎక్కువ భాగం ప్రభుత్వ భూమి, ఖాళీ భూమి, చౌడు భూమి అయినందువల్ల ఎవరికీ నష్టం లేదని, రోడ్డు వంకరలు లేకుండా సమాంతరంగా ఉందని అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. ఈ రోడ్డుకు కోడూరు చిన్న నందిగామ గ్రామాలు రింగురోడ్డుకు లోపలగా ఉండి కనెక్టివిటీ కూడా పెరుగుతుంది. కానీ తాజాగా అధికారులు సర్వే చేస్తున్న మార్గం అనేక మలుపులతో కూడి ఉంది. అంతేకాక అత్యంత విలువైన మా భూములలో ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయటం వలన తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని విన్నవించుకుంటున్నాము. అంతేకాక మా భూములలో అత్యంత విలువైన మామిడి, సపోటా వంటి తోటలతో పాటు పత్తి, మిర్చి, పసుపు, వరి వంటి వాణిజ్య పంటలు కోల్పోవాల్సి వస్తుంది. కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, ఎప్పటికీ సహకరిస్తామని హామీ ఇస్తున్నాము.మా విజ్ఞప్తిని మన్నించి, ఈ విషయాన్ని పెద్ద మనసుతో పరిశీలించి గతంలో మార్కింగ్ చేసిన మార్గంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేసే విధంగా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయవలసిందిగా నిరుపేద రైతులమైన మేము మిమ్ములను వేడుకుంటున్నాము." అని రైతులు వారి వినతిపత్రంలో కోరారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకూ రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి సహాయక నిధి ద్వారా రూ.42 లక్షల 6,378లు ఆర్థిక సహాయం అందచేసినట్లు శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఉదయం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే 59 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.42 లక్షల 6,378లు ఆర్థిక సహాయం అందచేసినట్లు వివరించారు. మొదటి విడతలో 15మందికి రూ.6,48,069లు, రెండవవిడతలో 15మందికి రూ.14,57,012లు, మూడవ విడతలో తాజాగా 29 మందికి రూ.21,01,297లు ఆర్థిక సహాయం మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు లబ్ధిదారుల తరపున ధన్యవాదములు తెలిపారు. ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా చల్లపల్లి మండలం యార్లగడ్డకు చెందిన యార్లగడ్డ అనసూయకు రూ.రెండు లక్షలు, బొబ్బా యుగంధరరావుకు రూ.లక్షా 62వేలు, ఘంటసాల మండలం శ్రీకాకుళంకు చెందిన గరికపాటి కృష్ణకుమారికి రూ.15వేలు, పాపవినాశనంకు చెందిన తాడంకి బాబూరావుకు రూ.30,786, తెలుగురావుపాలెంకు చెందిన గూడవల్లి బేబీ సరోజినికి రూ.56,324, నాగాయలంక మండలం ఎదురుమొండికి చెందిన నాలి వీరాంజనేయులుకు రూ.48వేలు, కోడూరు మండలం విశ్వనాధపల్లికి చెందిన బత్తుల బసవయ్యకు రూ.23,400, మోపిదేవి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రావెళ్ల వెంకటేశ్వరరావుకు రూ.30వేలు, చల్లపల్లికి చెందిన మిరియాల శేష పుష్పలతకు రూ.23,920, ఘంటసాల మండలం దేవరకోటకు చెందిన కే.వీరకుమారికి రూ.81,262, అవనిగడ్డ మండలం దక్షిణ చిరువోలులంకకు చెందిన వెంట్రపాటి రాజకుమార్‌కు రూ.77,900, రామకోటిపురానికి చెందిన గరికపాటి వెంకాయమ్మకు రూ.23,920, ఘంటసాల మండలం లంకపల్లికి చెందిన కనకమేడల సర్వోత్తమరావుకు రూ.70,100, చల్లపల్లి మండలం పాగోలుకు చెందిన ఆరేపల్లి వెంకట సింధూరికి రూ.23,920, మోపిదేవి మండలం మేళ్లమర్తిలంకకు చెందిన అప్పికట్ల శివ నాగరాజుకు రూ.21,974, అవనిగడ్డ కోటగిరిలంకకు చెందిన బత్తుల అరుణకు రూ.23,920, కంచర్ల ఆనంద్ బాబుకు రూ. ఇరవై వేలు, కోడూరు లింగారెడ్డిపాలెంకు చెందిన బచ్చు పార్వతికి రూ.29,593, అవనిగడ్డ కొత్తపేటకు చెందిన యలవర్తి రామలక్ష్మికి రూ.ఇరవై వేలు, చల్లపల్లికి చెందిన చిట్టా పావని దుర్గాకు రూ.1,17,668, అవనిగడ్డకు చెందిన కొడాలి కరుణకు రూ.27,970, కమ్మిలి సీతామహాలక్ష్మికి రూ.31,377, నాగాయలంక మండలం భావదేవరపల్లికి చెందిన అద్దంకి సుమలతకు రూ.25వేలు, ఘంటసాల మండలం చిట్టూర్పుకు చెందిన చిట్టూరి గోపీచంద్ కు రూ.21,974, శ్రీకాకుళంకు చెందిన మత్తి సుబ్బారావుకు రూ.2,70,876, కోడూరుకు చెందిన యార్లగడ్డ సక్కుబాయికి రూ.1,30,381, విట్టంశెట్టి నారాయణమ్మకు రూ.1,08,600, గుమ్మడి శ్రీనివాసరావుకు రూ.1,14,556, చందన కృష్ణశారదకు రూ.2,70,876 ఆర్థిక సహాయం చెక్కులు అందచేశారు.

## ఉభయ ముక్తేశ్వరుడికి బిల్వార్చన



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వేకనూరులో కొలువైన గంగా పార్వతీ సమేత ఉభయ ముక్తేశ్వరాలయంలో జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉభయ ముక్తేశ్వరుడికి లక్ష బిల్వార్చన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఘంటసాల వెంకటేశ్వర శాస్త్రి బ్రహ్మత్వంలో తాటి గడప వెంకటేశ్వర ప్రసాద్ నేతృత్వంలో మరో 10 మంది రుత్వికులు ఉభయ ముక్తేశ్వరుడికి పంచామృత గోక్షేర అభిషేకాలు చేశారు. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు అనంతరం బిల్వాలతో బిల్వదళాలతో స్వామికి అర్చన చేశారు. విశేష సంఖ్యలో భక్తులు ఉభయ ముక్తేశ్వరుని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నందీశ్వరుని విగ్రహం వద్ద పలువురు మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

## వైభవంగా పవన సుతునికి లక్ష ఫలార్చన





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** బహుళ కార్తీక దశమి సోమవారాన్ని పురస్కరించుకొని స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైయున్న సువర్చలా సహిత ప్రసన్న ఆంజనేయస్వామి వారికి లక్ష ఫలాలతోఅర్చన, పుష్పార్చనలు వైభవంగా జరిగాయి. ఇబ్రహీంపట్నం చెందిన ఆగమ పండితులు బృందావనం నరసింహమూర్తి ఆధ్వర్యంలో వేకువజాము నుండి స్వామివారికి అభిషేకాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం శాంతి హోమంలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొని పలు రకాల పుష్పాలతో అలంకరించి పుష్పార్చన చేయగా వివిధ రకాల పండ్లతో స్వామివారికి అర్చన చేశారు. అర్చక స్వాములు బృందావనం వేణుగోపాలచార్యులు అనంతరామాచార్యులు భక్తులకు తీర్ధప్రసాదాలను వితరణ చేయగా వందలాది మంది భక్తులు అన్న సంతర్పణలో పాల్గొని స్వీకరించారు.

## డ్రైవింగ్ స్కూల్ విసిటింగ్ చేసిన ఎం వి ఐ పూర్ణిమ



**నందిగామ, నవంబర్ 25, మేజర్ న్యూస్:** మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పూర్ణిమ సోమవారం నాడు గౌస్ హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్ ను సందర్శించి విజిటింగ్ చేశారు.గౌస్ హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్ లో గత 15 సంవత్సరాలుగా నిర్వహించిన బ్యాచ్ వివరాలు, స్కూల్ తరఫున చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ చాలీసా పారాయణం

**అవనిగడ్డ,మేజర్ న్యూస్ :** గాలిగోపురంలో కొలువైయున్న సువచ్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో లోక కళ్యాణార్థం భక్తుల ఆయురారోగ్యాభివృద్ధికి పాడిపంటలు సమృద్ధిగా ఉండేందుకు చేపట్టిన 108 రోజుల హనుమాన్ చాలీసా పారాయణం. సోమవారం 41వ రోజుకు చేరుకుంది ఈ సందర్భంగా భక్తులు అధిక సఖ్యలో పాల్గొని చాలీసా పారాయణం చేశారు. ప్రతిరోజు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని హనుమాన్ భక్త బృందం వారు తెలిపారు ఈ కార్యక్రమాన్ని శిరిడి సాయి అన్న ప్రసాదం నిర్వహణ చిట్టా ప్రసాద్ పర్యవేక్షించి భక్తులకు అవసరమైన ఏర్పాట్లను చేశారు.

## ఆరోగ్యానికి యోగాసనాలు అవసరం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మంచి ఆరోగ్యానికి యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆరోగ్య భారతి రాష్ట్ర సభ్యులు ఎన్.బి కామేశ్వరి అన్నారు. ధన్వంతరి జయంతి వారోత్సవాల్లో భాగంగా స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఆరోగ్య భారతి అఖిలభారత సేవా సంస్థ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కామేశ్వరి ఆరోగ్య భారతిని పరిచయం చేస్తూ ధన్వంతరి జయంతి విశేషాలను తెలియజేశారు. ఆరోగ్య భారతి కార్యదర్శి జల్లూరి రమకుమారి మాట్లాడుతూ యోగ ముద్రలు ఆసనాలు శరీరధారుధ్యానికి, మంచి ఆరోగ్యానికి దోహదపడతాయని కొన్ని ముద్దులను కొన్ని ముద్రలను విద్యార్థులకు పరిచయం చేశారు. గుండెపోటు వచ్చి మరణించిన వారిని ఎనిమిది నిమిషాల లోపు సిపిఆర్ ప్రక్రియ ద్వారా మరల వారికి జీవితాన్ని ఇవ్వ వచ్చునని కృత్రిమ శరీరంపై వత్తిడిని చేస్తూ ఎలా బ్రతికించాలో ప్రయోగాత్మకంగా విద్యార్థుల కు ఉపాధ్యాయుల కు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో120 మంది విద్యార్థులు 10 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ పరుచూరి మృతి



**పామర్రు నవంబర్ 25 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం హనుమంతపురం (గడ్డిపాడు) గ్రామ మాజీ సర్పంచ్, మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు పరుచూరి వెంకటేశ్వరరావు (75) సోమవారం ఉదయం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తుది శ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తీవ్ర సంతాపం వెలిబుచ్చారు. మండలంలో పార్టీ పటిష్టతకు ఆయన ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మృతి చెందిన వెంకటేశ్వరరావుకు కుమారుడు, కుమార్తె కలరు. కుమారుడు అమెరికాలో ఉంటున్నాడు. కుమారుడు వచ్చిన అనంతరం అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజ్ పనులు పూర్తి



**జి.కొండూరు, మేజర్ న్యూస్ :** మండలంలోని జి కొండూరు గ్రామంలో గత ఎన్నో రోజులుగా మూడు పంపుల సెంటర్‌లో డ్రైనేజ్ సమస్య దీర్ఘ కాలంగా పొంచి ఉంది పక్కన వివేకానంద స్కూల్ ఉండటంతో స్థానికులు ప్రజలు విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కడే పలుమార్లు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. స్థానికులు పంచాయతీ అధికారుల, సర్పంచ్ మండల అరుణ దృష్టికి తీసుకెళ్లడంతో పంచాయతీ కార్యదర్శి బసవలింగేశ్వ రావు దీనిపై వెంటనే స్పందించి జెసిపి సాయంతో సర్పంచ్, పంచాయతీ సిబ్బంది తో కలసి మరమ్మతులు చేపట్టి ఎంతో కాలం నుంచి పేరుకుపోయిన మురుగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికులు ఆ మురుగు నీటి వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ సమస్య పరిష్కారంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## శైవ క్షేత్రాల్లో చివరి కార్తీక సోమవారం పూజలు

### భక్తులతో పోటెత్తిన ఆలయాలు



**నండివాడ, మేజర్ న్యూస్:** భక్తులు పవిత్రంగా భావించే కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా పట్టణంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుండే దేవాలయాల్లో వేద పండితులు స్వామివారికి విశేష అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించగా..వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు క్యూ లైన్లలో బారులు తీరారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని గుడివాడలోని ప్రధాన ఆలయాలైన శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం.. శ్రీ గౌరీ శంకర స్వామి వారి దేవస్థానం.. శ్రీ ఆనందేశ్వర స్వామి వారి దేవస్థానం.. శ్రీ రామలింగేశ్వర దేవాలయల్లో తెల్లవారుజాము 4 గంటల నుండి నిరంతర దర్శనం కల్పించడానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాలయాల్లో భక్తులు దీప పూజలు నిర్వహిస్తూ స్వామి వారికి తమ మొక్కులను తొలగించుకున్నారు. చివరి సోమవారం కావడంతో ఆలయాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. దేవాలయాల్లో దీపాలు వెలిగిస్తూ పూజలు నిర్వహించుకునే మహిళా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని దేవాదాయ శాఖ అధికారి కందుల గోపాలరావు మీడియాకు తెలియజేశారు.

## వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణోత్సవం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ వేడుక లు ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని వేకనూరులో కొలువైవున్న వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో సోమవారం వాస్తు సిద్ధాంతి పాకలపాటి రామచంద్ర రావు స్వామివారి కళ్యాణాన్ని ఇరువురు దంపతులతో కనుల పండగ జరిపించారు. ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పెద్ద ప్రసాదాలు స్వీకరించారు.

# గౌడ సంఘీయుల అభివృద్ధికి కృషి చేస్తా

## : గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి





**పామర్రు నవంబర్ 25 మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ గౌడ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో నున్నలో ఏర్పాటుచేసిన గౌడ వన సమారాధన మహోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరంకి వెంకట గురుమూర్తి, శివరాం ప్రసాద్ లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాపై నమ్మకముతో మాకు ఈ పదవులు ఇచ్చారు మేము శక్తి వంచన లేకుండా ఎంత టైం అయినా శ్రమించి మా గౌడ జాతి కోసం అహర్నిశలు కష్టపడతామన్నారు. గౌడ జాతి అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరు చదువుకుని ఉద్యోగాల్లో వ్యాపారాల్లో కుటుంబీకులు అందరూ తలెత్తుకుని బతికేలా కృషి చేస్తామన్నారు. అలాగే మన గౌడ జాతికి పెద్దలు సర్దార్ గౌతు లచ్చన్న ఎనలేని సేవ చేశారని, ఆనాడు టంగుటూరి ప్రకాశం పంతులు కల్లుగీత వృత్తిని నిషేధించాలని తీర్మానం చేసినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న ఒప్పుకోకుండా ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు పై అవిశ్వాస పరీక్ష పెట్టారని గుర్తు చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా అయినా గౌతు లచ్చన్న భారత దేశ చరిత్రలో నెగ్గి కల్లుగీత కార్మికులకు అండదండలుగా నిలబడ్డారని, అలాగే సర్వాయి పాపన్న గౌడ్ ఎన్నో పోరాటాలు చేసారన్నారు. గీత వృత్తుల నుంచి వచ్చిన పాపన్న గౌడ్ ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసి వీరుడు అనిపించుకున్నారని అన్నారు. గౌడ జాతి కోసం అహర్నిశలు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘీయులు, ఎంప్లాయిస్ అందరూ వీరంకి వెంకట గురుమూర్తిని, శివరామకృష్ణ లను అభినందిస్తూ గజమాలతో సత్కరించారు. గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గా వీరంకి గురుమూర్తి నియమితులు కావడం తమకెంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు.

# ప్రజల నుండి అందే అర్జీలను అత్యధిక ప్రాధాన్యతతో సకాలంలో పరిష్కరించాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజల నుండి అందే అర్జీలను అత్యధిక ప్రాధాన్యతతో సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి మచిలీపట్నం ఆర్డిఓ కే.స్వాతి లతో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను ఎంతో ఓపికగా ఆలకించి, సంబంధిత అధికారులను పిలిపించి అర్జీదారుల సమస్యల వివరాలను అడిగి తెలుసుకుని వీలైనంత త్వరగా సానుకూలంగా వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధుల సమస్యలను వేదిక నుండి కిందకు దిగివచ్చి ప్రత్యేక శ్రద్ధతో విని ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం మాతృత్వం ఒక వరం,దత్తత దానికి మరో మార్గం అంటూ మహిళా శిశు సంక్షేమ శాఖ రూపొందించిన ఫ్లెక్సీ పోస్టర్ను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కలెక్టరేట్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అంతర్జాతీయ దత్తత మాసోత్సవంలో భాగంగా ఈసారి పోస్టర్ కేర్ – పోస్టర్ అడాప్షన్ ద్వారా పెద్ద పిల్లలను దత్తత చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ పార్వతి, ఐసిడిఎస్ పిడి సువర్ణ, డిఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి జెడ్పి సిఈఓ కే కన్నబాబు హౌసింగ్ పిడి వెంకటరావు డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్, ఉద్యాన అధి కారి జ్యోతి, డీఈఓ రామారావు మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ తదితర అధికారులు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# శానిటేషన్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



**నందిగామ, నవంబర్ 25, మేజర్ న్యూస్:** శానిటేషన్ వర్కర్లకు పిఎఫ్ డబ్బులు జమ చేయాలి. కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి. కార్మికులకు న్యాయం చేయాలి. నందిగామ గవర్నమెంట్ హాస్పటల్ లో పనిచేస్తున్న శానిటైజ్ వర్కర్లకు గత మూడు సంవత్సరాల నుండి కార్మికుల ఎకౌంటు నుండి పిఎఫ్ కట్ చేస్తున్నా కాని కాంట్రాక్టర్ దగ్గర నుండి కార్మికుల అకౌంట్లోకి జమ్మకావడం లేదని, తక్షణమే కార్మికుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు.మూడు సంవత్సరాల నుండి కార్మికుల అకౌంట్లు డబ్బులు కాంట్రాక్టర్ దోచుకుంటున్నారని పేర్కొంటూ నందిగామ ఆర్ డి ఓ బాలకృష్ణ కు సిఐటియు నాయకులు, కార్మికులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ... నందిగామ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు పిఎఫ్ నెంబర్లు,ఈఎస్ఐ కార్డు ఇప్పించాలని,ప్రతి నెలా మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిన అనేక సంవత్సరాలుగా విధులు బాధ్యతగా నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టర్ కృష్ణ ప్రసాద్ ప్రతినెల సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంటి అద్దెలు, విద్యా, వైద్య ఖర్చులు భరించలేక సతమతమవుతున్నారని తెలిపారు. తమరు జోక్యం చేసుకొని ప్రతి నెలా మొదటి వారంలో వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల వద్ద కాంట్రాక్టర్ పీఎఫ్,ఈఎస్ఐ వేతనాల నుండి కట్ చేస్తున్నారని,కాని పిఎఫ్ నెంబర్లు గానీ,ఈఎస్ఐ కార్డులు గానీ ఇంత వరకు కార్మికులకు అందజేయలేదన్నారు. కటింగ్ చేసిన డబ్బులు సదరు శాఖలకు జమ అవుతున్నది లేనిది కూడా కార్మికులకు తెలియటం లేదన్నారు.అనారోగ్యం వస్తే ఈఎస్ఐ ఉపయోగించుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందన్నారు. పిఎఫ్ నెంబర్లు,ఈఎస్ఐ కార్డులు కూడా కార్మికులకు అందజేసేలా కృషి చేయాలని కోరారు. శానిటేషన్ పనికి ఉపయోగించే వస్తువులను ఇచ్చేలా చూడాలని కోరారు. ఇప్పటికైనా కార్మికుల ఎకౌంట్లో కాంట్రాక్టర్ పిఎఫ్ జమ చేయకపోతే జిల్లా వ్యాప్తంగా అన్ని ఆసుపత్రిలో పనిచేసే కార్మికులతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని డిమాండ్ చేశారు. అనంతరం ఆ డి ఓ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నందిగామ నాయకులు కరి వెంకటేశ్వరావు, గవర్నమెంట్ హాస్పటల్లో పనిచేసే శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కార్మికులు, ప్రభుదాస్,ఏసుమ్మ, ఏసుబాబు,ఇస్రాయేలు,లింమ్మ పద్మ, మరియమ్మ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన సమారాధన

**పామర్రు నవంబర్ 25 మేజర్ న్యూస్ :** పామర్‌లోని రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన స్థానిక ఏఎన్ఎం పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా 26 మంది నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, 23 మంది నిరుపేద వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ తమ్ము రజిత గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బొమ్మారెడ్డి సూర్యనారాయణ రెడ్డి, మోర నాగిరెడ్డి, ఎ.పూర్ణచంద్రారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శి భీమవరపు శ్రీనివాసరెడ్డి, కోశాధికారి బొంతు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అంతకుముందు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలు చేశారు.

## భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు





**పామర్రు నవంబర్ 25 మేజర్ న్యూస్ :** కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకొని భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో దేవాలయాలు కిటకిటలాడాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న శైవ, వైష్ణవ దేవాలయాలకు తెల్లవారుఝామునుండే భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలను వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అలాగే పామర్రు లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, బుచ్చమ్మ ఆశ్రమంలో ప్రత్యేకంగా శివుని లింగ రూపంలో దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## జగ్గయ్యపేటకు వరించిన మరో డాక్టరేట్...

### డాక్టరేట్ పొందిన వైశ్య రత్న చారుగుండ్ల కొండా...



**జగ్గయ్యపేట, నవంబర్ 25, మేజర్ న్యూస్ :** పట్టణంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చారుగుండ్ల వెంకట లక్ష్మీ నారాయణ(కొండా)కి కర్ణాటక రాష్ట్రం హోసూర్ కు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రిసెర్చ్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ని ప్రధానం చేశారు. డాక్టరేట్ అందుకున్న చారుగుండ్ల కొండా ని జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను వారి స్వగృహంలో అభినందించి శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్రరావు, ఆర్యవైశ్య ప్రముఖులు కొత్త పురుషోత్తం, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, కౌన్సిలర్ పందుల రోశయ్య, మైనారిటీ నాయకులు షేక్ సత్తార్, బిసి సంఘం నాయకులు కోసూరి ప్రహ్లాద్, గుంజ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు



## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, నవంబర్ 25, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డా. జి. లక్ష్మీషా ని వారి కార్యాలయంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు, పి ఏ సి సభ్యులు,టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

## కలెక్టర్‌ను గౌరవప్రదంగా కలిసిన కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీసా ను విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో గౌరవప్ర దంగా కలిశారు.

## కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరే షన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జానిపాషా యన్.టి.ఆర్ జిల్లా కలెక్టర్ గా నూతన బాధ్యతలు చేపట్టిన డా.జి.లక్ష్మి షా ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఆత్మీయంగా పలకరించి సమాజ హితం కోసం బాధ్యతగా విధులు నిర్వర్తించాలని,ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎం.శశిధర్,యస్.కె.మహబూబ్ సుభాని,జి.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రరావు కుటుంబ సభ్యులకు వికుర్తి శ్రీనివాస్ పరామర్శ



**కోడూరు మేజర్ న్యూస్ :** కృష్ణాపురం గ్రామంలో ఇటీవల మరణించిన ముద్దినేని కోటమ్మ కుటుంబానికి వికుర్తి శ్రీనివాస్ తమ సానుభూతిని తెలిపారు. కృష్ణాపురం వారి నివాసం వద్ద కోటమ్మ కుమారుడు కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు ఆయన సోదరులను శ్రీనివాస్ ఆయన సోదరుడు రాంబాబు, కలిసి పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీను, రేపల్లె ఈశ్వర్ రావు, రేపల్లె ప్రతాప్, బొప్పన రమణతో పాటు కోడూరు మాజీ ఎంపీపీ పెద్ది భాస్కర్ రావు, బడే వీరబాబు, నాగం పాపయ్య, రాజా ఉన్నారు.

## వేములపాలెంలో మినీ గోకులం షెడ్డుకు శంకుస్థాపన



**ఘంటసాల, మేజర్ న్యూస్:** కృష్ణాజిల్లా, ఘంటసాల, మండల పరిధిలోని వేములపాలెంకు చెందిన పాడి రైతు సోడా బత్తిన నాగబాబు కు మినీ గోకులం పథకం ద్వారా మంజూరైన పశువుల షెడ్లు నిర్మాణానికి సోమవారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు నరేష్ మాట్లాడుతూ పశువుల సంరక్షణకు ప్రభుత్వం మినీ గోకులం పథకం ద్వారా రాయితీపై పాడి రైతులకు షెడ్లు నిర్మిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ మార్క్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలి









**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని 5వ ట్రాఫిక్ సీఐ రవి కుమార్ అన్నారు. సోమవారం పాలిక్లినిక్ రోడ్‌లోని చైతన్య టెక్నో స్కూల్ నుండి బెంజ్ సర్కిల్ వరకు విద్యార్థులు ర్యాలీగా వెళ్లి, హెల్మెట్ లేని బైకర్స్ ను హెల్మెట్ పెట్టుకోవాలని, కార్ డ్రైవింగ్ చేసే వాళ్ళని సీట్ బెల్ట్ పెట్టుకోవాలని చిన్నారులు కోరారు. జీబ్రా క్రాసింగ్ గురించి సెల్ ఫోన్ డ్రైవింగ్ వల్ల జరిగే అనర్థాలు గురించి సీఐ రవి కుమార్ పిల్లలకు వివరించారు. అనంతరం స్కూల్‌లో ఏర్పాటు ట్రాఫిక్ అవగాహన సదస్సులో భాగంగా చిన్నప్పటి నుండే తెలుసుకోవాలని హెల్మెట్ ధరించడం వల్ల లాభాలు, నష్టాలు, సీట్ బెల్ట్ లేకుండా కార్ డ్రైవింగ్ చేస్తే జరిగే నష్టాలేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జీవీఎన్.కుమార్, కాలేజీ డీన్ రామకృష్ణ, ఇంచార్జ్ మాధవి పాల్గొన్నారు.

## ఓం నమశ్శివాయ పంచాక్షరి మంత్రంతో మారుమోగిన శివాలయాలు



కంచికచర్ల నవంబర్ 25 మేజర్ న్యూస్ ఓం నమశ్శివాయ పంచాక్షరి మంత్రంతో మండల కేంద్రంలో మండలంలోని గ్రామాల్లో శివాలయాలు మారుమోగాయి. కార్తీకమాస నాల్గవ సోమవారం దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుండి దేవాలయాల్లో భక్తులు పోటెత్తారు. బ్రహ్మ ముహూర్తం నుండే భక్తులు శివాలయాలలో దీపారాధన చేసి, తులసి పూజ గావించి, స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవాలయాలు తెల్లవారుజాము నుండి భక్త జన సందోహంతో కిక్కిరి సాయి. మహిళలు కార్తీక దీపాలను భక్తిశ్రద్ధలతో వెలిగించారు.స్థానిక శివాలయంలో భక్తులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేశారు.భక్తులు స్వామివారి కి ఏకాదశి రుద్రాభిషేకములు, పంచామృత అభిషేకములు చేయించుకొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఓం నమశ్శివాయ నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.

## లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ ఉచిత ఆన్లైన్ ఐటీ ట్రైనింగ్



**కోడూరు మేజర్ న్యూస్ :** లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ సంస్థ 22 వ వార్షికోత్సవం సందర్భంగా 6వ ఉచిత ఆన్లైన్ ఐటీ ట్రైనింగ్ ప్రారంభిస్తున్నట్లు లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ వ్యవస్థాపకులు పూతబోయిన అయ్యప్ప స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం చదువుకున్న గ్రాడ్యుయేట్స్ ఇనిస్టిట్యూట్ కు వెళ్ళి ఐటీ కోర్సులు నేర్చుకోలేకపోతున్న వారికి లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ వారు చేయూతనిచ్చేందుకు ఐటీ టెక్నాలజీస్ లో మంచి ప్రావీణ్యం ఉన్న ఫ్యాకల్టీలతో ఆన్లైన్ ద్వారా ఐటి కోర్సులకు ట్రైనింగ్ ఇవ్వడానికి తమ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. ఈ ట్రైనింగ్ సమయంలో కెరీర్ గైడెన్స్ తో పాటు టెక్నికల్ స్కిల్స్, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, పెంపొందించుకోవడానికి లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ టీమ్ సహకరిస్తుందని తెలిపారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ జాయిన్ అవ్వదలచుకున్న వారికి ల్యాప్ టాప్ గాని, కంప్యూటర్ సిస్టం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ ఆన్లైన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్లో జాయిన్ అవ్వడానికి ఆసక్తి ఉన్నవారు తమ బయోడేటాను లెజెండ్ సార్ సర్వీస్ సెంటర్ వారికి ఈ మెయిల్ ద్వారా తమ అంగీకారాన్ని చెప్పాలని సూచించారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు మండలంలో పలు గ్రామాల్లోమైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు చెక్కుల రూపంలో లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. తెదేపా మండల శాఖ అధ్యక్షకార్యదర్శులు పజ్జూరు రవికుమార్, లంకా రామకృష్ణ వరప్రసాదులు సిహెచ్. మాధవరం, గంగినేనిపాలెం, కోడూరు, వెల్లటూరు గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో అనారోగ్యానికి గురి వైద్య చికిత్సలు చేయించుకున్న వారికి ప్రభుత్వం నుంచి మంజూరైన సాయాన్ని అందజేశారు. చెరువు మాధవరం గ్రామానికి చెందిన గుగులోతు చంటికి రూ.1,28,185 లు, గంగినేనికి చెందిన ఉండి మోదుగుల పద్మకు రూ.28,125లు, కోడూరుకు చెందిన మన్నే లక్ష్మికి రూ.67,761 లు, వెల్లటూరుకు చెందిన చింతపల్లి శ్రీనివాసరావుకు రూ.37,100లు మంజూరయ్యాయి. చెక్కులతో పాటు సీఎం చంద్రబాబు నాయుడు పంపిన లేఖను కూడా ఆయా గ్రామాల నాయకులతో కలిసి వారికి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో చెరువు మాధవరం సర్పంచ్ బాణావతు సరస్వతి, తెదేపా నాయకులు గుడిపూడి శివశంకర్, మన్నే కోటి బాబు, గుగులోతు శ్రీను, పుల్లూరు శ్రీనివాసరావు, బాణావతు రాము, బండ్ల శివయ్య, దేవులపల్లి రమణమూర్తి, ఆళ్ల కొండ, కస్తాల ప్రసాద్, ఆళ్ల నరసింహారావు, పచ్చిగోళ్ళ బాలకృష్ణ, చింతపల్లి బాబు, ఆర్ శివయ్య, ఆళ్ల గోపాలరావు, అన్నం శెట్టి శ్రీను, బొబ్బూరి బ్రహ్మేశ్వరరావు, బొబ్బూరి శ్రీను, పగడాల సాంబయ్య, చింతపల్లి సుధాకర్, మారం రాం బాబు బలగాని గోవర్ధన్, ఆకుల రామారావు, పగడాల రామకృష్ణ, పగడాల శ్రీనివాసరావు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఆర్టీవో కార్యాలయం వద్ద ధర్నాని జయప్రదం చేయండి



**నందిగామ, నవంబర్ 24, మేజర్ న్యూస్:** రేపు ఆర్డీవో కార్యాలయ వద్ద జరిగే ధర్నాన్ని జయప్రదం చేయాలని చనమూల సైదులు అన్నారు. నందిగామలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమ్మొలు సైదులు, సిఐటియు జిల్లా కార్యదర్శి కటారపుగోపాల్ 26 నవంబర్ 2024న నందిగామ ఆర్డీవో ఆఫీస్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి. 26 నవంబర్ 2024న నందిగామ ఆర్డీవో ఆఫీస్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చెయండి.నందిగామ మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం 26వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల, ఆర్ డి ఓ రెవెన్యూ కార్యాలయం వద్ద దర్నా చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనంరూ.26,000/-లుగా నిర్ణయించి అమలు చేయాలని కోరారు. కార్మికులకు పిఎఫ్, ఇ ఎస్ ఐ పటిష్టంగా అమలు చేయాలని కోరారు.కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, డెయిలీవేజ్, 'కంటినెంట్ ఉద్యోగులను రైగ్యులరైజ్ చెయ్యాలని కోరారు. సైదా, నాగరాజు, బేబీ, ప్రసాద్,రూత్తమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

# ఆహార శుద్ధి పరిశ్రమలు, గ్రూప్ పరిశ్రమలు ప్రారంభించవచ్చు





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆహార శుద్ధి పరిశ్రమలు, గ్రూప్ పరిశ్రమలు ప్రారంభించవచ్చని కలెక్టర్ డీ కే బాలాజీ తెలిపారు. జిల్లాలో సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ పరిశ్రమలు ఫుడ్ ప్రసేసింగ్ యూనిట్ విరివిగా స్థాపించి, ఉపాధి పొందేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డి కే బాలాజీ అధికారులను ఆదేశించారు. కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలయ్యే ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం అమలుకు జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్లో నిర్వహించారు. ఈ పథకం కింద వ్యక్తిగత ఆహార శుద్ధి పరిశ్రమలు, గ్రూప్ పరిశ్రమలు ప్రారంభించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఎక్కువగా రైతు తయారీదారుల సంఘాలు, సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలలో ప్రతి సభ్యునికి ఈ పథకం పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ పథకంలో 10% లబ్ధిదారు వాటా కాగా, 90 శాతం బ్యాంకుల ద్వారా రుణాల మంజూరుకు అవకాశం ఉందని, యూనిట్ ఏర్పాటు చేసి మంచిగా రన్ చేసుకుంటూ 35% సబ్సిడీగా తిరిగి పొందవచ్చని, ఈ పథకం జిల్లాలో ఎక్కువమంది వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు ఈ స్కీం గురించి ప్రతి సభ్యురాలికి తెలియజేయాలన్నారు. ఈరోజు సాయంత్రం 5.30 గంటలకు ఏపీఎంలకు జూమ్ కాన్ఫరెన్స్ పెట్టి ఈ పథకం గురించి వివరించాలని, అదేవిధంగా మైక్రో క్రెడిట్ ప్లాన్ గురించి కూడా వివరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 2020 నుండి ప్రారంభమైన ఈ పథకం 2025 వరకు అమలులో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సూక్ష్మ సేద్య పథకం ఈవో, కమిటీ కన్వీనర్ విజయలక్ష్మి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె జ్యోతి, ఎల్డీఎం జయవర్ధన్, వ్యవసాయ శాఖ డిడి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 74 ఫిర్యాదులు



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో ఎన్.టీ.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, ఆదేశాలు మేరకు డి.సి.పి. ఏ.బి.టి.ఎస్. ఉదయారాణి ప్రజా సమస్యల పరిష్కార వేదిక"( పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 74 ఫిర్యాదులపై భాదితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అందిన ఫిర్యాదుల్లో నగదు లావాదేవీలకు సంబంధించినవి 22, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 10, మహిళా సంబంధిత నేరలకు సంబంధించి 05, భూవివాదాలకు సంబంధించినవి 18, వివిధ మోసాలకు సంబంధించినవి 06, సైబర్ నేరాలకు సంబంధించినవి 01, కొట్లాటకు సంబంధించినవి 03,, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు, సంఘటనలకు సంబంధించినవి 09, మొత్తం 74 ఫిర్యాదులును స్వీకరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించుటలో సహకారాన్ని అందించారు.

## ప్రతి ఫిర్యాదును త్వరితగతిన పరిష్కారం ఇవ్వండి

### విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** అందిన ప్రతి ఫిర్యాదును అధికారులు స్వయంగా, ఫిర్యాదు చేసిన వారి వద్దకు వెళ్లి పరిశీలించి సమస్యకు పరిష్కారం అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారము ఉదయం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను చిట్టినగర్ లో ఉన్న సర్కిల్ 1,జోనల్ ఆఫీస్‌లో నిర్వహించారు. ప్రజా ఫిర్యాదులను స్వీకరిస్తూ అక్కడున్న అధికారులతో సర్కిల్ 1 పరిధిలో ఉన్న సమస్యల గురించి చర్చిస్తూ, వీడియో కాన్ఫరెన్స్



ద్వారా సర్కిల్ 2, 3, కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న ఫిర్యాదుల స్వీకరణను పరిశీలించారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సర్కిల్ 1 కార్యాలయంలో 2 ఫిర్యాదులు అందగా, కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో 11 ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా ఇంటి పనులు డోర్ నెంబర్ కరెక్షన్స్, అనధికార కట్టడాలు, ఆక్రమణలు, త్రాగునీటి సమస్యలు పై ప్రజలు ఫిర్యాదులు చేశారు. ఈ సోమవారం సర్కిల్ 1 కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ తో పాటు జోనల్ కమిషనర్ 1 రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఇంచార్జ్ అసిస్టెంట్ కమిషనర్ హెలెన్, సానిటరీ సూపర్వైజర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు అసిస్టెంట్ ఇంజనీర్లు, పాల్గొన్నారు.



## ఉపాధి హామీ గ్రామ సభలు

**రెడ్డిగూడెం నవంబర్ 25, మేజర్ న్యూస్:** రెడ్డిగూడెం మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గ్రామాలలో కూలీలకు పనులు కల్పించడానికి ఉపాధి హామీ పథకంలో చేపట్టవలసిన పనులను గుర్తించి, గ్రామపంచాయతీల్లో పంచాయతీ సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించి గ్రామ పంచాయతీల ఆమోదం పొందవలసి ఉన్నదని ఎంపీడీవో రమణ అన్నారు, ఈ సభల్లో జాబు కార్డులను పరిశీలించి చనిపోయిన వారిని కార్డులో నుంచి తొలగించి, కొత్తవారి పేర్లు నమోదు చేసి వినిపిస్తామన్నారు, ఈ సభలు నవంబర్ 26 నుండి 30 వ తారీకు వరకు మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ సెక్రటరీలు సంబంధిత అధికారులు పాల్గొనవలసినదిగా కోరారు.

## భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్



**మొవ్వ మేజర్ న్యూస్:** అనుమానంతో భార్యను హత్య చేసి పరారైన భర్తను అరెస్టు చేసి మొవ్వ కోర్టులో హాజరు పరిచినట్లు పామర్రు సీఐ వి.సుభాకర్ తెలిపారు. పెడసనగలు గ్రామ శివారులో నివాసముంటున్న తుపాకుల శివ పార్వతిని భర్త అశోక్ 23వ తేదీ అర్ధరాత్రి రోకలిబండతో తలపై మోదీ హత్య చేసి పరారైన విషయం పాఠకులకు విధితమే. ఈ కేసులో ముద్దాయి తుపాకుల అశోక్ ను పెడసనగల్లు గ్రామ శివారు ధర్మారం వద్ద అరెస్టు చేసి మొవ్వ కోర్టులో హాజరపరిచినట్లు సీఐ సుభాకర్ తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ ఆధ్వర్యంలో టీచర్స్ కు శిక్షణ



**నందిగామ, నంబర్ 25, మేజర్ న్యూస్:**లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ వారి ఆధ్వర్యంలో నందిగామలోని కాకతీయ అపోలో ఇంగ్లేష్ మీడియం ఉపాధ్యాయనీ ఉపాధ్యయులకు రెండు రోజులపాటు లయన్స్ క్వెస్ట్ లో శిక్షణ నిర్వహించడం జరిగింది. లయన్స్ క్వెస్ట్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ డాక్టర్ యర్రంరెడ్డి గాంధి ఆధ్వర్యంలో హైదరాబాదు కి చెందిన శిక్షకురాలు డాక్టర్ కె. లక్ష్మి మూర్తి విద్యార్థుల భావోద్వేగ నియంత్రణ, వ్యక్తిత్వ వికాసం, కుటుంబ సమాజ సత్సంభందాల గురించిన విలువలతో కూడిన విద్యను అందించడంలో పాటించవలసిన విషయాల గూర్చి శిక్షణ నిచ్చారు. కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ కాపా రవీంద్ర ఈ కార్యక్రమం పై ప్రత్యేక శ్రద్ద చూపించి 40 మంది ఉపాధ్యాయులు పాల్గొనేటట్లు ప్రోత్సహించారు. కార్యక్రమాన్ని జిల్లా గవర్నర్ గద్దే శేషగిరి ప్రారంభించగా ముగింపు సమావేశానికి ముఖ్య అతిధిగా మల్టిపుల్ ఛైర్ పర్సన్ దామర్ల శ్రీశాంతి పాల్గొన్నారు. జిల్లా ఉప గవర్నర్ వి.వి.పి.ఎస్. ఆంజనేయులు, క్లబ్ అధ్యక్షులు మందడపు సీతారామయ్య పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి సద్వినియోగపరచుకోండి

**ఘంటసాల, మేజర్ న్యూస్:** ముఖ్యమంత్రి సహాయ నిధి ని ఉపయోగించుకోవాలని స్థానిక శాసనసభ్యులు మండల ప్రసాద్ పేర్కొన్నారు. అవనిగడ్డలో శ్రీకాకుళం గ్రామానికి చెందిన మత్తి సుబ్బారావు, గరికిపాటి కృష్ణకుమారి, పాపవినాశనం గ్రామానికి చెందిన తాడింకీ బాబురావు, తెలుగురావు పాలెం గ్రామానికి చెందిన బేబీ సరోజినీలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువ నాయకులు మండలి వెంకట్రామ్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందన్నారు రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోం దన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర నాయకులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), పాపవినాశనం టీడీపీ నేత కుంపటి చిట్టిబాబు, శ్రీకాకుళం ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కొండవీటి పవన్ కుమార్, మత్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ లేడీస్ హాస్టల్ బాత్రూమ్స్‌లో..

## ఎటువంటి హిడెన్ కెమెరాలు లేవు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ లేడీస్ హాస్టల్ బాత్రూమ్స్‌లో ఎటువం హిడెన్ కెమెరాలు లేవు అని, విద్యార్థుల వద్ద కూడా ఎటువం టి బాత్రూం ఫోటోలు గాని వీడియోలు గాని లేవు అని స్టేట్ ఫారెన్సిక్ లేబ రేటరీస్ పరీక్ష ద్వారా నిర్ధారణ అయినట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ డీ.కె. బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర రావు సంయుక్తంగా ఒక ప్రకటనను విడుదల చేశారు.

## బందరు కోట కోదండరామస్వామి దేవస్థానంలో మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేక పూజలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సోమవారం బందరు కోట్ల వేంచేసి ఉన్నటువంటి కోదండరామ స్వామి దేవస్థానంలో రాజగోపురం పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంత్రి కొల్లు రవీంద్ర దంపతులు సతి సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## శివారాధన వలన సర్వ దోషాలు తొలగుతాయి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర రాబర్ట్ సన్ పేటలో వేంచేసి ఉన్న రామలింగేశ్వర స్వామి వారి అభిషేక,అర్చన లో పాల్గొన్నారు. శివుడిని ఆరాధించడం వలన సర్వ దోషాలు తొలగుతాయి అని, శివా అంటే అనుగ్రహించి కోరికలు తీర్చే ఏకైక దేవుడు శివుడి అని, శివునకు ఇష్టం అయిన ఈ కార్తీక మాసం లో ప్రతి ఒక్కరూ శివుడిని కొలిచి శివానుగ్రహం పొందాలని మంత్రి కోరారు.

# రైతుల ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించండి





**పామర్రు నవంబర్ 25 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గం లో వరి ధాన్యం కొనుగోలులో రైతులు పడుతున్న ఇబ్బందులను త్వరతగతిన పరిష్కరించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి(డిఎస్ఓ) సృజన ను శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా కోరారు. సోమవారం పౌరసరపరాల అధికారి సృజన మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కుమార్ రాజాను కలిశారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోళ్లపై ఆమెతో సమీక్ష చేశారు. ఇప్పటికే రైతులు ధాన్యాన్ని రోడ్ల పక్కన రాశులుగా పోసి ఉంచారని తుఫాన్ హెచ్చరికలతో వారిలో తీవ్ర ఆందోళన నెలకొని ఉందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. క్రింద స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో సహకరించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మిల్లుల కేటాయింపు, సంచుల సరఫరా, ధాన్యం రవాణా కు సంబంధించి వాహనం ఏర్పాటు విషయాల్లో జిల్లా అధికారిగా ఆమె బాధ్యత తీసుకుని సకాలంలో రైతులకు అందేలా చూడాలని కోరారు. వాతావరణం అనుకూలంగా ఉంటే ఇబ్బందులు ఉండవని, కానీ తుఫాన్ హెచ్చరికల కారణంగా రోడ్ల పక్కన ఉన్న ధాన్యం రాశులను వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమెకు సూచించారు. రైతులు ఇబ్బందులకు గురికాకుండా సకాలంలో చర్యలు తీసుకుని పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి సృజన ఎమ్మెల్యే కుమార్ రాజాకు హామీ ఇచ్చారు.

# క్రీస్తుని ఆరాధించడమే క్రిస్మస్

## రెవ పాస్టర్ ఎం. స్పర్జన్ కుమార్





కృత్తివెన్ను నవంబర్ 25 మేజర్ న్యూస్. క్రీస్తుని ఆరాధించడమే నిజమైన క్రిస్మస్ అని కొమళ్ళపూడి ప్యారిస్ పాస్టర్ రెవరెండ్ ఎం స్పర్జన్ కుమార్ తెలిపారు. సోమవారం నుంచి క్రిస్మస్ నెల మొదలైన సందర్భంగా తెల్లవారుజామున ప్రార్థనలు నిర్వహించినట్లు వివరించారు. సీతనపల్లి సి ఎస్ ఐ పరిశుద్ధ స్తెఫన్ దేవాలయంలో జరిగిన ఆరాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని వాక్య సందేశం అందించారు. క్రిస్మస్ అంటే పిండి వంటలు, గృహాలకు పెయింటింగ్ లు, నూతన వస్త్రాలు మాత్రమే కాదని క్రీస్తుని ఆరాధించడమే నిజమైన క్రిస్మస్ అన్నారు. లోక రక్షకుడు జన్మించి ఎప్పటికీ సుమారు 2024 సంవత్సరాలు అవుతున్నప్పటికీ క్రీస్తుని ఆరాధించే విషయంలో చాలా వెనకబడి ఉన్నామన్నారు. క్రైస్తవ్యం అంటే మతం కాదని రక్షణ మార్గమన్నారు. చాలామంది క్రైస్తవ్యాన్ని మతంలా చిత్రీకరించి చూస్తున్నారని అలాకాకుండా మానవాళిని రక్షించి సరైన మార్గాన్ని చూపించి పరలోకం చేర్చేది క్రైస్తవ్యం అన్నారు. పరమత సహనం పాటిస్తూ పాపపు బంధకాలలో నలిగిపోతున్న ప్రతి ఒక్కరి కోసం ప్రార్థించి వారి రక్షణ కోసం పనిచేసేదే క్రైస్తవ్యం అని పేర్కొన్నారు. ప్రతి విశ్వాసి దేశ రాష్ట్ర పాలన చేస్తున్న నాయకుల కోసం ప్రార్థిస్తూ ఉండాలని కోరారు. ప్రజలందరూ నిత్యం సుఖ సంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. క్రీస్తును వెంబడించేవారు లోకానికి మాదిరిగా ఉండాలని సూచించారు. ప్రార్థన మందిరాలను విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించి స్టార్ ను ఏర్పాటు చేశారు. సంఘ పెద్దలు, సంఘవిశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులతో మిల్క్ యూనియన్ చైర్మన్ ముఖాముఖి



**నందిగామ, నవంబర్ 25, మేజర్ న్యూస్:** చందర్లపాడు మండలం లోని ఏటూరు చింతలపాడు పాల సహకార సంఘాల పాడి రైతులతో ముఖాముఖి కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఏటూరు గ్రామంలో నూతనంగా(5నెలల క్రితం) పాల కేంద్రం ఏర్పాటు చేసుకుని పాల సేకరణ చేయుటకు గ్రామంలోని పాల కేంద్రం అధ్యక్షులు పాలేటి. గోపాల కృష్ణ ప్రసాద్ సహకారంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నానో మిషనరీతో రోజుకు 250లీ. పాలు సేకరిస్తూ.. పాల ఉత్పత్తి దారులకు మరింత చేయుతను అందిస్తున్నట్లు వివరిస్తూ, కృష్ణా మిల్క్ యూనియన్ వారు 350/- విలువ గల మేలు జాతి సెమెన్ 50/- రూ.లకే అందిస్తున్నామని, ఎక్కువ పాలు ఇచ్చే పశు సంపదను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా జిల్లా యూనియన్ యంత్రాంగం పని చేస్తున్నట్లు వివరించారు.అలాగే ప్రతి గ్రామంలో తిరగకట్టుతున్న పశువులను గుర్తించి వాటిని చూడి కట్టించటానికి తగిన చర్యలు మా యూనియన్ ఆధ్వర్యంలో ఉన్న పశు వైద్యాధికారులు, ఫీల్డ్ సిబ్బంది తీసుకుంటారని దానికి రైతులు సహకరించాలని కోరారు. అలాగే ప్రభుత్వ సహకారంతో గ్రామాలలో పశువైద్య మెగా క్యాంప్ లు నిర్వహిస్తామని వివరిస్తూ,, కేవలం సెమెన్ కొరకే సంవత్సరానికి 2 కోట్లు ఖర్చు చేస్తున్నామని, మంచి పాడి ఛార గల దూడలను అభివృద్ధి చేస్తే ముందు తరం పాడి మరింత పెరుగుతుందని వివరించారు, పాడి పశు పోషణ యందు పలు సూచనలు, సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పాలక వర్గ సభ్యులు నెలకుదిటి నాగేశ్వరరావు ట్రస్ట్ సభ్యులు కోకా వెంకటేశ్వరరావు, క్లస్టర్ మేనేజర్ బి.నరేష్, పాల సంఘం అధ్యక్షులు వలిబోయిన బాలాజీ, సూపర్ వైజర్ నరసింహారావు, పి. శ్రీనివాసరావు, సెమెన్ వర్కర్ వెంకటేశ్వరరావు, వేతన కార్యదర్శిలు వెంకట్రావు, పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు.



## మేజర్ కాలువలో పూడికతీతని ప్రారంభించిన ఎమ్మెల్యే

**వత్సవాయి, మేజర్ న్యూస్:** మండలంలో గోపినేనిపాలెం గ్రామంలో పెనుగంచిప్రోలు మేజర్ కాలువలో పూడికతీత పనులను శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేగినేటి గోపాలకృష్ణ, కర్ల నాగేశ్వరరావు, కామినేని కిషోర్, అలసకాని నవీన్, మన్నే నారా యణ రావు, బొల్లం పురుషోత్తం, జిల్లేపల్లి సుధీర్ బాబు,బేతోలు,డి రంగయ్య, మన్నె నారాయణ (మిల్క్), నరేష్, రైతు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శంఖుస్థాపన చేసిన జనసేన నరేష్



**పామర్రు నవంబర్ 25 మేజర్ న్యూస్ :** పామర్రు టౌన్‌లోని కోటిరెడ్డిపేటలో సీసీ రోడ్డు పనులకు పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, దీనిలో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో సిసి రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. దీనిలో భాగంగానే మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఈరోజు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాపర్ల ఎంపిటిసి సభ్యులు కూనపరెడ్డి సుబ్బారావు, జనసేన నాయకులు మట్ట అనిల్, కాకర్ల జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో పేదోడికి మళ్ళీ పట్టెడన్నం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ, నవంబర్ 25, మేజర్ న్యూస్:** ఎంతో మంది పేదలు తినడానికి తిండి లేక పస్తులు పడుకుంటున్న సందర్భాలు ఉన్నాయని, అన్న క్యాంటీన్ల ద్వారా పేదల కడుపు నింపుతు న్నామనే సంతోషం తనకు ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య చెప్పారు. సోమవారం నాడు నందిగామ పురపాలక రైతు బజార్ వద్ద ఉన్న ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ సందర్శించి పేదలకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014-2019 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్వహించిన అన్న క్యాంటీన్లను గత వైకాపా ప్రభుత్వం మూసివేసి నిరుపేదలను రోడ్డున పడేసిందన్నారు. అధికారంలోకి వచ్చాక తిరిగి అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎన్డీయే ప్రభుత్వం తాజాగా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. పేదోడికి మళ్లీ పట్టెడన్నం అందిస్తోందన్నారు. పేదలకు అన్నం పెట్టే ఈ మంచి కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సౌమ్య పిలుపునిచ్చారు. తమ వంతుగా ప్రజలు విరాళాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు.



18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999